క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



బొల్లాపల్లి : నాయుడుపాలెం గ్రామంలో విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. వేదపండితులు బైర వకోన అనుమలకొండ పీఠాధిపతి శ్రీరామ డుగు గురుబ్రహ్మేంద్రస్వామి ఆధ్వర్యంలో సీతాలమ్మ తల్లి, పోలేరమ్మ, పోతురాజు, గ్రామదిక్కుల్లో బొడ్రాయి ప్రతిష్ఠ నిర్వహించారు. ఆలయాల్లో వేదపండితుల మంత్రోచ్ఛ రణల మధ్య గ్రామంలోని పలు కుటుంబాలకు చెందిన దంపతులు పూజలు చేశారు. చివరి రోజు కావడంతో గ్రామంలో భారీ అన్నదానం నిర్వహించారు.

పీఎంశ్రీ పథకానికి సాతులూరు జెడ్పీహెచ్ఎస్

నాదెండ్ల: ప్రధాన మంత్రి స్కూల్ రైజింగ్ ఫర్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైంది. ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఐదేళ్ళ పాటు ఏటా రూ.36 లక్షల చొప్పున రూ.1.80 కోట్లు పాఠశాల అభివృద్ధికి మంజూరు చేయనుంది. దీంతో పాఠశాల రూపురేఖలు మారి విద్యార్థులకు మెరుగైన వసతులతో పాటు నాణ్యమైన విద్య అందనుంది. ఈ నిధులతో ఇంటరాక్టివ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, ల్యాబ్స్, అదనపు గదులు, క్రీడాభివృద్ధి తదితర రంగాల్లో ఖర్చు చేయనున్నట్లు ఎంఈఓ ఐ.ఆంజనేయులు తెలిపారు.

8 నుంచి ఉపాధి పనులపై ఆడిట్



శావల్యాపురం: 2022–23 ఆర్థిక సంవత్సరంలో 16వ విడత జాతీయ ఉపాధి హామీ పథకం పనుల నిధుల వినియోగంపై సామాజిక తనిఖీ బృందాలు పారదర్శకంగా ఆడిట్ చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య చెప్పారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.7 కోట్ల 71 లక్షల 89 వేలు పనులు చేసినట్లు చెప్పారు. ఇందులో కూలీల వేతనం రూ. 4 కోట్ల 36 లక్షల 45 వేలు, మెటీరియల్ ఖర్చు రూ.3 కోట్ల 35 లక్షల 44 వేలు వెచ్చించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీవో టి.పద్మజా, ఎస్ఆర్పీ పి.బుజ్జి ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి ఎలక్ట్రీషియన్ మృతి



నరసరావుపేట టౌన్: విద్యుదాఘాతానికి గురై ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన శుక్రవారం పట్టణంలో జరిగింది. బీసీ కాలనీకి చెందిన షేక్ నసీమ్(18) రెడ్డినగర్ 2వ లైన్‌లో కొత్తగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లో ఎలక్ట్రీషియన్ పని చేస్తున్నాడు. డ్రిల్లింగ్ మిషన్ తీసుకొస్తుండగా ప్రమాదవశాత్తు జారి విద్యుత్ సరఫరా అవుతున్న తీగపై పడ్డాడు. కరెంట్ షాక్ తగిలి స్పృహ కోల్పోయాడు. గమనించిన కార్మికులు విద్యుత్ సరఫరా నిలిపివేసి బాధితుడిని ఏరియా వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున వైద్యశాలకు చేరుకున్నారు. భవన యజమానిపై చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు.

గుర్తుతెలియని మహిళ మృతి



నరసరావుపేట టౌన్: గుర్తుతెలియని మహిళ మృతిచెందిన ఘటన నరసరావుపేట పట్టణంలో శుక్రవారం జరిగింది. వన్‌టౌన్ ఎస్ఐ ఎస్.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆయన కథనం ప్రకారం.. మార్కెట్ సెంటర్ సమీపంలోని సాంబశివ ఫర్నిచర్ దుకాణం వద్ద సుమారు 60ఏళ్ల మహిళ మృతి చెంది ఉంది. సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతిరాలి తలభాగంలో గాయం ఉండటాన్ని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మహిళ గురించి తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

నమో నారసింహా





రొంపిచర్ల: విప్పర్లపల్లి గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న దీక్షా కార్యక్రమాలు శుక్రవారం స్వామి కల్యాణోత్సవం, గ్రామోత్సవంతో ముగిశాయి. 1న లక్ష్మీగణపతి హోమం, లక్ష్మీహోమం నిర్వహించారు. 2న సుదర్శన లక్ష్మీనరసింహ హోమం, 3న నవగ్రహ హోమం, 4న స్వామి జయంతి, అభిషేకాలు నిర్వహించారు. శుక్రవారం స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం జరిగింది. కార్యక్రమాలు అర్చక స్వాములు చతుర్వేదుల హరి సర్వోత్తమ శాస్త్రి, చతుర్వేదుల సీతా రామాంజనేయ శాస్త్రితో పాటు పలువురు రుత్వికులు పాల్గొన్నారు.

ఉరుసు మహోత్సవాలు ప్రారంభం



దర్గాలో దువా చేస్తున్న ముజావర్లు, భక్తులు

చిలకలూరిపేటటౌన్: బొప్పూడి గ్రామంలోని హజరత్ సయ్యద్ బాజీబాబా దర్గా 40వ ఉరుసు మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వేకువ జామునుంచే భక్తుల రాకపోకలతో దర్గా వద్ద సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు దర్గా అభివృద్ధి కమిటీ సభ్యులు వసతులు కల్పించారు. బాజీబాబా దర్గాను రంగులతో ప్రత్యేకంగా అలంకరించారు. బాబావారి సమాధిపై పూలచద్దర్లు, గంధం, అత్తర్లు ఉంచడంతోపాటు సాంబ్రాణీ ధూపం వేయడంతో ఆ ప్రాంతంలో పరిమళాలు వెదజల్లాయి. 16వ నంబర్ జాతీయ రహదారి నుంచి బొప్పూడి గ్రామం వరకు రోడ్లన్నీ బైకులు, ఆటోలు, ట్రాక్టర్లు, జనంతో రద్దీగా మారాయి. బాజీబాబాను దర్శించుకున్న భక్తులు దర్గా చుట్టూ ప్రదక్షిణలు చేసి పూల చద్దర్లు కప్పి, కొబ్బరికాయలు కొట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. బాబావారిని దర్శించుకున్న భక్తులకు పలు రకాల ప్రసాదాలను వితరణ చేశారు. ఉరుసుకు వచ్చిన భక్తులందరికీ భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు అన్నదానం కొనసాగించారు. అనంతరం భక్తులు దర్గా వద్దనే జాగారం చేశారు. ఖురాన్ పఠిస్తూ, నమాజ్, దువా చేస్తూ గడిపారు. అర్ధరాత్రి బొప్పూడి గ్రామం నుంచి విద్యుత్ వెలుగుల్లో బాజీబాబా గంధం ఊరేగింపును మేళతాళాలతో తీన్‌మార్ డప్పు వాయిద్యాలతో నిర్వహించారు. దర్గా ముజావర్లు, అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, ప్రజలు ఉరుసు ఉత్సవ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వేసవి శిక్షణతో సరికొత్త నైపుణ్యాలకు శ్రీకారం



శిక్షణకు హాజరైన విద్యార్థులకు ఉచిత విద్యాసామగ్రి అందజేస్తున్న దృశ్యం

యడ్లపాడు: వేసవి ప్రత్యేక శిక్షణ తరగతులు విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం.. సరికొత్త నైపుణ్యాలపై ఆసక్తిని పెంపొందిస్తాయని పీఆర్ విజ్ఞాన కేంద్రం సభ్యులు నూతలపాటి కాళిదాసు పేర్కొన్నారు. స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాల ఆవరణలో యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ విద్యావిభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యా పాఠ్యాంశాలపై నిపుణులచే శిక్షణ, అలాగే వివిధ రంగాలపై అవగాహన, సాంస్కృతిక, కళాత్మక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కల్పించి వారిలోని సృజనాత్మకతను పెంపొందిస్తున్నట్లు వెల్లడించారు. మరో అతిథి చెరుకూరి సృజన మాట్లాడుతూ దానాలన్నింటి కన్నా విద్యాదానం గొప్పదన్నారు. అనంతరం విద్యార్థులకు విద్యాసామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యావిభాగ కమిటీ సభ్యులు కల్లూరి వాసు, కేతా రామబ్రహ్మం, ముత్తవరపు వేణుగోపాల్, రామిశెట్టి నాగేశ్వరరావు, షేక్ మీరావలి, విజయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వీరవట్నంలో గ్రామోదయం



గ్రామ పెద్దలను సన్మానిస్తున్న సర్పంచ్ తదితరులు



గ్రామోదయ కార్యక్రమంలో ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న అధికారులు

రొంపిచర్ల : మండలంలోని వీరవట్నం గ్రామంలో సర్పంచ్ మానుకొండ వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఇంటింటికీ వైద్యసిబ్బంది తిరిగి ఆరోగ్యం, సీజనల్ వ్యాధుల రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అనంతరం గ్రామ సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న గ్రామ పెద్దలను సన్మానించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పోతిరెడ్డి జగన్ నరసింహారెడ్డి, ఈవోపీఆర్డీ కె.విజయరాము, వీఆర్ఓ విద్యాసాగర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.


పలకూరులో..

బొల్లాపల్లి : ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఇన్‌చార్జి ఎంపీడీవో టి.పార్వతి సూచించారు. పలుకూరు సచివాలయ పరిధిలో శుక్రవారం గ్రామోదయం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు పాల్గొని పాఠశాలలకు సంబంధించి విద్యార్థులను, అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి కిశోర బాలికల ప్రగతిని, ఉపాధి హామీ పనులను, ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని పరిశీలించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కిశోర బాలికల్లో రక్తహీనత నివారణపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈవో వి.ఏసుబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.పద్మజారాణి, వైద్యాధికారి జి.వీరనరేష్, ఏపీవో ఎస్.ఆంజనేయరాజు, కో–ఆప్షన్ మెంబరు షేక్ మౌలాలి పాల్గొన్నారు.

శావల్యాపురంలో..

శావల్యాపురం: శావల్యాపురం గ్రామసచివాలయం పరిధిలో ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి పనులను పరిశీలించి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఎంపీటీసీ సభ్యులు పోతురావు, మండల కో–ఆప్షన్ సభ్యులు దూదేకుల హుస్సేన్, ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం, ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



అధికారులతో కలిసి క్రీస్తు కాలనీని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట: పేదలు నివసించే కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణంలోని క్రీస్తు కాలనీని మున్సిపల్ అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కాలనీలో మూడు లైన్లలో డ్రెయినేజీల నిర్మాణానికి రూ.35 లక్షలతో అంచనాలు రూపొందించినట్లు వివరించారు. 90 మీటర్ల రోడ్డు నిర్మాణానికి అంచనాలు రూపొందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, ఏఈఈ సీహెచ్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

పేద యువతి వివాహానికి సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న జాన్‌సైదా

చిలకలూరిపేటటౌన్: పేదల ఇంట వివాహాలకు జ్ఞానేశ్వర ఫౌండేషన్ చేయుతనిస్తోందని ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్‌సైదా చెప్పారు. శుక్రవారం పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన షేక్ సైదులు, అమీనాబీ దంపతుల కుమార్తె నాగురబీ వివాహానికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సైదా మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆయన వెంట ఎంపీ రత్నారెడ్డి తదితరులు ఉన్నారు.

మోడల్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వినుకొండ(నూజెండ్ల)/నాదెండ్ల : 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి నూజెండ్ల ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మజ శుక్రవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150 దరఖాస్తు రుసుము చెల్లించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మోడల్ పాఠశాలలో జూన్ 11న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

- నాదెండ్ల మండలం చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో చేరగోరే విద్యార్థులకు జూన్ 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఝాన్సీవాణి తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 9 నుంచి 25వ తేదిలోగా ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు.

కార్మికులు ఐక్యంగా పోరాడాలి



చిలకలూరిపేట: ఆటో కార్మికులు సమైక్యంగా పోరాడి సమస్యలు పరిష్కరించుకోవాలని సీఐటీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె హనుమంతరెడ్డి చెప్పారు. సీఐటీయూ అనుబంధ పల్నాడు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కళామందిర్ సెంటర్ నుంచి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు, నాయకులు బొల్లు శంకరరావు, కారుచోల రోశయ్య, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి ప్రతిష్ఠా మహోత్సవాలు

రొంపిచర్ల : ఎడ్వర్డ్‌పేట గ్రామంలో ఈనెల 7న నిర్వహించనున్న లక్ష్మీ గణపతి స్వామి కీర్తి ధ్వజ ఆలయ పరివార దేవతా ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమాల్లో భాగంగా ఉదయం సుప్రభాత సేవ, గ్రామ తోరణం, కలశతీర్థం, గణపతి పూజ, కలశస్థాపన పూజ, అగ్ని ప్రతిష్ఠ, మహానివేదన, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వినియోగం, అంకురారోపణ, జలాధివాసం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో బ్రహ్మశ్రీ కోట వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో పలువురు రుత్వికులు పాల్గొన్నారు.

సభల పోస్టర్ల ఆవిష్కరణ

మాచర్ల: పట్టణంలోని ప్రతి చర్చి అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలందిస్తానని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని రాయవరం జంక్షన్‌లో ఈ నెల 22 నుంచి 25 వరకు జరిగే కల్వరి మినిస్ట్రీస్ సభలు జరగడం సంతోషకరమని ప్రభుత్వ విప్ పీఆర్కే అన్నారు. ఈ సందర్భంగా నాలుగు రోజుల పాటు జరిగే కల్వరి ఉజ్జీవ సభలు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దైవజనులు పాస్టర్ ప్రవీణ్‌కుమార్, సిస్టర్ షారోన్‌ల ఆధ్వర్యంలో ఉజ్జీవ సభలు ఏర్పాటు చేయటం ఆనందకరమన్నారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో పాస్టర్లు కేతావత్ చందునాయక్, బొమ్మిరాజు, వేల్పుల ఏసుదాసు, ఎం రాంబాబు, పి పూర్ణచంద్రరావు, నరేష్, సురేష్, కౌన్సిలర్ మందా సంతోష్ రావు, వేల్పుల గురవయ్య, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

పాత పద్ధతిలోనే వేసవి భత్యం ఇవ్వాలి



ఉపాధి కూలీలతోమాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

యడ్లపాడు: ఉపాధి కూలీలకు వేసవి భత్యం, పే స్లిప్పులు పాత పద్ధతిలోనే ఇవ్వాలని వ్యవసాయ కార్మికసంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కారుచోల రోశయ్య డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డితో కలిసి శనివారం మండలంలోని యడ్లపాడు, కారుచోల, జగ్గాపురం, జాలాది గ్రామాల్లో పర్యటించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు నిర్వహిస్తున్న ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 22న నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా చేపడుతున్నట్లు వెల్లడించారు.

‘లక్ష’ణంగా కుంకుమార్చన



ప్రత్యేక అలంకరణలో శ్రీశారదాంబ అమ్మవారు

శ్రీశృంగేరి శంకరమఠం 34వ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గోపాలభట్ ఆధ్వర్యంలో శ్రీశారదాంబ అమ్మవారు, శ్రీశంకర చంద్రమౌళీశ్వర స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాదాపు 600 మంది మహిళలు లక్ష కుంకుమార్చనలో పాల్గొన్నారు. రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ సహకారంతో కుంకుమార్చన, అన్న ప్రసాద వితరణ చేశారు. శంకరమఠం ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 6న శనివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజాధికాలు నిర్వహిస్తున్నట్లు శంకరమఠం మేనేజర్ కె.వి.కె.నాగరాజు తెలిపారు. కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలను, ప్రత్యేక అలంకారంలో కటాక్షించిన శారదాంబ అమ్మవారిని చిత్రాల్లో చూడొచ్చు.

– నరసరావుపేట ఈస్ట్



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

అరవిందబాబూ అబద్ధాల ప్రచారం మానుకో

విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు



విలేకర్ల సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

నరసరావుపేట: టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అరవిందబాబు అబద్ధాలు ప్రచారం చేయడం మానుకోవాలని వైఎస్సార్ సీపీ నేతలు హితవుపలికారు. శుక్రవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనుల వద్ద సెల్ఫీ దిగి తామే చేశామని చెప్పుకోవడం అరవిందబాబుకు పరిపాటిగా మారిందని విమర్శించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై విమర్శలు చేసే అర్హత అరవిందబాబుకు లేదని స్పష్టం చేశారు. ముందు తన పార్టీలో వర్గపోరును సరిదిద్దుకోవాలని, వచ్చే ఎన్నికల్లో సీటు తనకేనో కాదో అరవిందబాబు నిర్ధారించుకోవాలని ఎద్దేవా చేశారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికే దక్కుతోందని స్పష్టం చేశారు. కేవలం వివాహేతర సంబంధం వల్లే అల్లూరివారిపాలెంలో జేమ్స్ అనే యువకుడి హత్య జరిగిందని, దీనికి రాజకీయాలకు సంబంధమేమిటని వైఎస్సార్ సీపీ నేతలు ప్రశ్నించారు. గతంలో జొన్నలగడ్డలో నాగరాజు హత్యలో ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసి ప్రతిపక్ష నేత నవ్వుల పాలయ్యారని పేర్కొన్నారు. కోడెల హయాంలో ఆయన కుమారుడు, కుమార్తె అనేక కేసులు పెట్టి ప్రజలను దోచుకొని ప్రతిపక్ష నాయకులను ఇబ్బందులు పెట్టారని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీలను కించపరిచిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని వివరించారు. అవినీతి, అక్రమాలు తప్పితే టీడీపీ నాయకులు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో రొంపిచర్ల జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబులురెడ్డి, స్వర్ణాంధ్ర, ముదిరాజు కార్పొరేషన్ల డైరెక్టర్లు ఎస్.సుజాతాపాల్, ఈఎం స్వామి, వైఎస్సార్ సీపీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు పడాల శివారెడ్డి, జిల్లా ఎస్సీసెల్ మానిటరింగ్ కమిటీ మెంబర్ మల్లెల అశోక్, జిల్లా కార్యదర్శి కందుల ఎజ్రా, రొంపిచర్ల మండల కన్వీనర్ పచ్చవ రవీంద్ర, వడ్డెర సంక్షేమ సెల్ కమిటీ జిల్లా మెంబరు వేముల శివ, సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి ఎన్కే ఆంజనేయులు, మట్ల లింగారెడ్డి పాల్గొన్నారు.

వి.రెడ్డిపాలెం చైతన్యగోదావరి బ్యాంకుకు 11 అవార్డులు



శావల్యాపురం బ్యాంకు మేనేజరు విశ్వనాథ్



అవార్డులతో వి.రెడ్డిపాలెం చైతన్యగోదావరి బ్యాంకు మేనేజర్ కిషోర్‌రెడ్డి

రొంపిచర్ల/శావల్యాపురం: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు శాఖ పలు విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచి 11 అవార్డులు దక్కించుకున్నట్టు మేనేజర్ తిమ్మారెడ్డి కిషోర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఇటీవల గుంటూరులో నిర్వహించిన బ్యాంకు వార్షిక సమావేశంలో ఈ అవార్డులను అందజేసినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా మేనేజర్ తిమ్మారెడ్డి కిషోర్‌రెడ్డిని సిబ్బంది దుశ్శాలువాతో సన్మానించారు.

ఉత్తమ మేనేజర్‌గా విశ్వనాథ్

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించినందుకు గాను ఉత్తమ మేనేజరు అవార్డు అందుకున్నట్లు శావల్యాపురం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు బ్రాంచ్ మేనేజరు ఇలింద్రపర్తి విశ్వనాథ్ చెప్పారు. శుక్రవారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో మేనేజరు మాట్లాడుతూ బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వర రావు, నరసరావుపేట రీజనల్ మేనేజరు పి.మారుతీ రామ్ చేతుల మీదుగా గత నెల 30న ఉత్తమ మేనేజరు అవార్డు, ప్రశంస పత్రాలు అందుకున్నట్లు చెప్పారు.

దాసునాయన మఠంలో పౌర్ణమి వేడుకలు



దాసునాయన మఠం

నాదెండ్ల: గణపవరం సినిమా హాలు రోడ్డులో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఆంజనేయ ఉపాసకులు అచల దాసునాయన మఠంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మఠాధిపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలు, కీర్తనలు ఆలపించారు. స్థానిక పీఠాధిపతి కటారు దాసునాయన మాట్లాడుతూ ప్రస్తుతం మఠం నిర్మాణంలో ఉందని, ప్రతి పౌర్ణమి రోజున మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించనున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీఠాధిపతులను శాలువాలతో సత్కరించారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నూతలపాటి హనుమాయమ్మ, తోట దాసునాయన, గొట్టిపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి వేసవి శిబిరం

చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో స్కూల్ విద్యార్థుల కోసం ఈ నెల 8వ తేదీ నుంచి వేసవి వినోద శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ ఇన్‌చార్జి నాగుర్ మీరావలి చెప్పారు. ఈ శిబిరం 40 రోజులపాటు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతుందని వివరించారు. పుస్తక పఠనం, కథలు చెప్పడం, ఫజిల్స్ పూర్తి చేయించటం, బొమ్మలు గీయించటం, డ్యాన్స్, జనరల్ నాలెడ్జ్ తదితర శిక్షణలు ఉంటాయని వెల్లడించారు.